క్లుప్తంగా

4న కురేసిని అమ్మవారి సంబరం

కంచిలి: కుంబరినౌగాం పంచాయతీ పరిధి కొనక గ్రామంలో వెలసిన కురేసిని అమ్మవారి సంబర మహోత్సవాన్ని వచ్చేనెల నాలుగో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకుడు, స్థానిక సర్పంచ్ నిత్యానంద జన్ని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఏడు నుంచి మరుసటి దినం ఉదయం ఆరు గంటల వరకు అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. సంబరం సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. ఉత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం


కైలాస్‌చౌదరి (ఫైల్)

మందస: మూలిపాడు పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు కైలాస్‌చౌదరి (55) ఆదివారం ఆకస్మికంగా మరణించారు. ఈయన మృతిపట్ల పలువురు సంతాపం తెలియజేశారు. వివాహ ఫంక్షన్‌కు వెళ్లిన కైలాస్ చౌదరి అక్కడే మృతి చెందారు. కైలాస్ మృతి సమాచారం తెలుసుకున్న సర్పంచ్ గుసిరి వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, నాయకులు కాశీనాథ్‌మహంతి, చంచలమహంతి, గౌతమి, గీత ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబాన్ని ఓదార్చారు. చౌదరి మృతి పార్టీకి తీరనిలోటని రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీపీ డొక్కరి దానయ్య సంతాపం తెలియజేశారు.

కంచిలి పట్టణంలోనికి రాని బస్సులు!


బైపాస్ రోడ్డులో వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు


కంచిలి: మండల కేంద్రమైన కంచిలి పట్టణంలోకి రాకుండానే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య చాలా రోజులుగా ఉంది. ప్రయాణికుల వినతి మేరకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఈ సమస్యపై ఆర్టీసి ఉన్నతాధికారులకు గతంలో లేఖ రాశారు. దీనికి స్పందించిన అధికారులు కేవలం రాజమండ్రి డిపోకు చెందిన బస్సులకు మాత్రమే ఈ రూట్‌లో అనుమతి లేదని, మిగతా అన్ని సర్వీసులు కంచిలి మీదుగానే నడపాల్సి ఉందని స్పష్టత ఇచ్చారు. కానీ చాలా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కంచిలి పట్టణాన్ని తప్పించి బైపాస్ రోడ్డులోనే రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కంచిలి పట్టణంలోకి ఎక్స్‌సర్వీసులు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి


మాట్లాడుతున్న చంద్రమౌళి

టెక్కలి: సమాజ శ్రేయస్సుకు జర్నలిస్టులు పాటు పడాలని టెక్కలి సీఐ చంద్రమౌళి అన్నారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. వృత్తిపట్ల నిబద్ధత అవసరమన్నారు. ఈ సందర్భంగా సీఐ చంద్రమౌళి, ఎస్సై రామకృష్ణను ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పి.ఎ.పంతులు, అధ్యక్షుడు కె.సుదర్శన్, ఉపాధ్యక్షుడు ఎస్.గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన


పైపులను పరిశీలిస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్న ప్రాజెక్టులో భాగంగా వినియోగించే పైపులు నాణ్యతగా ఉండేలా చూడాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి కాంట్రాక్టు సంస్థను కోరారు. ఈ మేరకు మండలంలోని సిర్తలి స్టాక్ పాయింట్ వద్ద పైపులను ఆదివారం పరిశీలించారు. పాడైన, లీకులులేని పైపులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటబొమ్మాళి: నిమ్మాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున సోమవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేయనున్నారు. ఈ విషయాన్ని టెక్కలి విద్యుత్‌శాఖ డీఈ రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

శ్రమదానం..



ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 23వ వార్డులో ఉన్న సయ్యద్‌ఖాన్ చెరువుని ఉప్పలవీధికి చెందిన యువత శ్రమదానంతో ఆదివారం బాగు చేశారు. చెరువు నిండా పిచ్చిమొక్కలు, నాచు పేరుకుపోయింది. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ఏడో వార్డు మాజీ కౌన్సిలర్ బర్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో యువకులు సోమేష్, ఇసురు ఢిల్లీ, నారాయణ, అభిమన్యు, బాలు, రవి తదితరులు శ్రమదానం చేసి మొక్కలు, నాచును తొలగించి ఆదర్శంగా నిలించారు. స్థానికులు యవకులను అభినందించారు.

- ఇచ్ఛాపురం

ఆశల పూత..




రెండో కోనసీమగా భావించే ఉద్దానంలోని కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా జీడి, మామిడి పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జీడి.. మామిడి చెట్లకు పూత బాగా వచ్చింది. దీంతో ఈ ఏడాది పంట దిగుబడి బాగుంటుందని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. చీడపీడల దాడి, పొగమంచు ప్రభావం లేకపోతే పూత నిలబడి పంట దిగుబడి బాగుంటుందని ఆశిస్తున్నారు.

-కవిటి

చలిమంట..



వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం ఎనిమిది గంటల వరకూ పొగమంచుతోపాటు చలిగాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయాన్నే వివిధ పనుల కోసం వెళ్లే వాళ్లు చలి నుంచి ఉపశమనానికి మంటలు వేసుకొని వెచ్చదనాన్ని కాగుతున్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

టాలెంట్ టెస్టుకు అనూహ్య స్పందన


పలాస: ప్రతిభ చూపించిన విద్యార్థులతో వేదిక ప్రతినిధులు


కవిటి: విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షకు అనూహ్య స్పందన వచ్చింది. సుమారు మూడు వందల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యా సదస్సు కూడా జరిగింది. వేదిక అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రధాన వక్తలుగా మానసిక వికాస నిపుణులు రామ్‌బుడ్డి గణపతి, పుక్కళ్ల చిరంజీవి, డాక్టరు టి.బాలకృష్ణ విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. కాగా టాలెంట్ టెస్టులో కొండప్ప ఇందు (ఒంకులూరు), గొరకల గణేష్ (రంగోయి), పసుపురెడ్డి సతీష్ (రంగోయి)మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తామాడ మదన్, బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాశరావు, బత్తిన ఓంకార్, రెయ్యి కృష్ణారావు, పి.బాలరాజు, బొడ్డు సుధాకర్, కామేశ్వరరావు, తెప్పల వాసుదేవరావు, తంగుడు ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంపొందాలి

కవిటి: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని బొరివంక ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ అన్నారు. పాఠశాలలో మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కవిటి ప్రభుత్వ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా.. రాజపురం ఏపీ మోడల్ స్కూల్ ద్వితీయ, రాజపురం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడోస్థానంలో నిలిచాయి. విజేతలకు పాఠశాల సిబ్బంది బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ


పనుల ప్రారంభానికి పూజ చేస్తున్న దృశ్యం

మందస: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులతో వలసల నివారణ సాధ్యమని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, కొత్తపల్లి సర్పంచ్, సేనాపతి దివ్య, కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు అన్నారు. కొత్తపల్లి పంచాయతీలో ఉపాధి పనులకు ఆదివారం పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే చాలామంది స్థానికంగా పనుల్లేక వలసలు వెళ్తుంటారని, వీటిని నివారించేందుకే పనులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. రెండు పూటలా పని చేసి గిట్టుబాటు వేతనం వచ్చేలా చూసుకోవాలని వేతనదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ తెప్ప జగదీష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సేనాపతి ఈశ్వరరావు, బమ్మిడి వాసుదేవరావు, తెప్ప రవికుమార్, లక్కోజి లోకనాథం, అన్నెపు సుధాకర్ పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: జిల్లా అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పల్లివీధిలో సంఘ భవనంలో జరిగింది. వార్డు కౌన్సిలర్లు ఉమాహరిప్రసాద్, దున్న నిర్మాలాసత్యం ముఖ్య అతిథులుగా హాజరవ్వగా.. పట్టణ కుల పెద్దల సమక్షంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దివంగత ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు విగ్రహం ఏర్పాటుకి పలాస పట్టణంలో ప్రభుత్వం స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా సంఘ నాయకులు కోరారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

సోంపేట: ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. తన కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. దూర ప్రాంతాల మిల్లులను కేటాయించినా ప్రభుత్వమే రవాణా చార్జీలు చెల్లిస్తోందని.. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మిల్లుల వద్దకు రైతులు వెళ్లాల్సిన అవసరం లేదని.. రైతు భరోసా కేంద్రాల సిబ్బందే అన్నీ చూసుకుంటారన్నారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయడానికే దూర ప్రాంతాల్లోని మిల్లులను ఆన్‌లైన్ చేసినట్టు పేర్కొన్నారు. మండలంలో రూ. 18 కోట్లు విలువైన ధాన్యాన్ని సేకరించినట్టు చెప్పారు. మరో రెండు వారాలు ధాన్యం సేకరణ జరుగుతోందన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి


బడిబయట పిల్లల్ని గుర్తిస్తున్న సీఆర్పీలు

ఇచ్ఛాపురం రూరల్: బడిఈడు పిల్లలు కచ్చితంగా పాఠశాలలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీలో పార్టటైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలానికి సంబంధించి 148 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు సర్వే బృందం నివేదిక అందించినట్టు పేర్కొన్నారు. వీరిలో 115 మందిని సిబ్బంది గుర్తించినట్లు పేర్కొన్నారు.

వీనులవిందుగా పంచరత్న కీర్తనలు


పంచరత్న కీర్తనలను గానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: త్యాగయ్య రచించి గానం చేసిన పంచరత్న కీర్తనల గానం వీనుల విందుగా సాగింది. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో కచ్చపి కళాక్షేత్రం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు, దశమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యనమండ్ర శ్రీనివాసశర్మ, దూసి కనకమహాలక్ష్మీ, కరి యామినీకృష్ణ, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ బృందం కీర్తనలను చక్కగా గానం చేశారు. ముందుగా పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం నుంచి బాపూజీ కళామందిర్ వరకు త్యాగరాజస్వామి చిత్రపటంతో నగర సంకీర్తన సాగింది. అపర్ణ బృందంచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం నాదసమ్మేళన కార్యక్రమంలో వై.శ్రీనివాసశర్మ కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ, మావు దూరు సూర్యప్రసాదరావు, మావుదూరు సత్యనారాయణశర్మ, ఇనపకుర్తి మన్మధరావు, దూసిరమేష్, దుంపల ఈశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్లకు గుర్తింపు కార్డులు అందజేత


గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 12వ వార్డు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు గుర్తింపు కార్డులను ఆదివారం అందజేశారు. వార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమా నేతృత్వంలో వార్డు ఇన్‌చార్జి హరిప్రసాద్ వీటిని పంపిణీ చేశారు.

తులసమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మకు ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి మేళతాళాలతో భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

175 రకాల నైవేద్యాల సమర్పణ



భక్తులు సమర్పించిన నైవేద్యాలు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ పరిధిలోని వెంకటేశ్వరస్వామి, పద్మావతిలకు 175 రకాల నైవేద్యాలను ఆదివారం భక్తులు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

సీఎం జగన్ హయాంలో ముస్లింలకు లబ్ధి

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అనేక విధాలుగా మేలు జరిగిందని కోటబొమ్మాళి కోఆప్షన్ సభ్యుడు, మండల ముస్లిం నాయకుడు రంజాన్ రాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పలు సంక్షేమ పథకాలు మంజూరు చేశారన్నారు. ముస్లింలపై వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆ పార్టీ నాయకులను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

సత్యసాయి సేవాసమితి కన్వీనర్‌గా జగదీష్



కాశీబుగ్గ: సత్యసాయి సేవాసమితి పలాస కన్వీనర్‌గా డోకి జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానికంగా ఆదివారం జరిగిన సమావేశంలో ఈయన్ని సభ్యులు ఎన్నుకున్నారు. జగదీష్ ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. సత్యసాయి విద్యావిహార్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, పూర్వపు కన్వీనర్ చుండూరు శ్రీరాంమూర్తి, తర్లనా రమేష్, పెంట కొంతేయుడు, సూర్యప్రకిష్, శరత్‌బాబు, జిల్లా సాధనా శిబిరం ఇన్‌జార్జి జామి శ్రీనివాస్, తాళాసు శ్రీను, కృష్ణసాహులు జగదీష్‌ను అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్
- మాకన్నపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న సమన్వయకర్త సాయిరాజ్

సోంపేట: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. పారదర్శక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. మాకన్నపురం సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం సాయిరాజ్ మాట్లాడుతూ.. ప్రతి గడపలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. విద్య, వైద్యం, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు ఇళ్ల మంజూరు, మహిళల డ్వాక్రా రుణాల మాఫీ జగనన్న పాలనలోనే సాధ్యమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరువ చేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు మనమంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, పార్టీ నాయకులు మోహనరావు, బట్టి మాధవరావు, పకాల బత్తుల హరీష్, ఢిల్లీరావు, సతీష్, పాపారావు, తులసీరావు, కృష్ణారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు సాయిరాజ్ పరామర్శ


పరామర్శలో సాయిరాజ్ తదితరులు

సోంపేట: బుసాబద్ర పంచాయతీ చౌకపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బతకల జగన్నాయకులు, అదే గ్రామానికి చెందిన మద్దిల డిల్లెమ్మ ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బతకల మోహనరావు, నర్తు తులసయ్య, బతకల సతీష్, బతకల విశ్వనాథం, సాలిన నరసింహులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మున్సిపాలిటీకి చెందిన ప్రసాద్ మహారణ 2004-05లో స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. ఈయన కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఆదివారం అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐదు వేల రూపాయల నగదు, రెండు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందించారు. పూర్వ విద్యార్థులు కొవ్వూరు రాజేష్, లండ పాపారావు, రట్టి మనోజ్‌కుమార్, నెయ్యిల శివకుమార్, మార్పు శ్యామలరావు, సనపల హరి, సుడీయ అవినాష్, ధర్మరాజు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


సాయిరాజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట:

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జైభీమ్ సేన సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌ను ఆదివారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు. అధ్యక్షులు నగిరి మోహనరావు, ప్రతినిధులు ప్రకాశరావు, శ్రీకాంత్, హర్షవర్ధన్, కాళిదాసు, లక్ష్మణ్, ఈశ్వరరావు ఉన్నారు.

పాకివలసలో పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలస గ్రామంలో సర్పంచ్ కోతి చిన్నారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేశారు. కార్యక్రమంలో తోట సింహాచలం, చింతల వీరప్పన్న పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్


లబ్ధిదారులకు సంబంధించిన బుక్‌లెట్లను సిద్ధం చేస్తున్న వలంటీర్లు

కోటబొమ్మాళి: లఖందిడ్డి-2 గ్రామ సచివాలయానికి చెందిన 14 మంది వలంటీర్ల సేవలు బాగున్నాయని సర్పంచ్ బమ్మిడి గణపతితోపాటు స్థానికులు చెప్పారు. లఖందిడ్డి పంచాయతీ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మూడు రోజులుగా జరుగుతోంది. దీంతో లబ్ధిదారులకు అందిన లబ్ధి, వారికి సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించే పనిలో వలంటీర్లు నిమగ్నమై ఉన్నారు.

రోటరీ సేవకులకు సత్కారం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, సోంపేట రోటరీ క్లబ్‌ల సేవలు బాగున్నాయని రోటరీ ఇంటర్నేషనల్ 3020 డిస్ట్రిక్ గవర్నర్ రోటేరియన్ ఏకేఎస్ భాస్కర్ రామ్ ప్రశంసించారు. రాజమహేంద్రవరంలో రోటరీ ఇంటర్నేషనల్ 3020 డిస్ట్రిక్ గవర్నర్ రోటేరియన్ భాస్కర్‌రామ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2022 సంవతసర్రంలో ఇచ్ఛాపురం, సోంపేట రోటరీక్లబ్ వారు అందించిన సేవలను కొనియాడారు. రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డి.కృష్ణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడ ఎం.నవీన్‌కుమార్, డాక్టర్ దక్కత త్రినాథరెడ్డి, పి.దినేష్, తులసీదాస్, రోహిత్, వెంకటేష్ పాల్గొన్నారు.